ఫలాలంకరణ



వివేక్‌నగర్ ఆలయంలో భువనేశ్వరి అమ్మవారు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని భువనేశ్వరి అమ్మవారిని పండ్లతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి దేవనాథం, ప్రధాన అర్చకుడు లక్ష్మీపతిశర్మ పూజ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం



బర్కత్‌పురలో ఆరాధనోత్సవాల అంకురార్పణలో మఠం మేనేజర్ సూర్యచంద్రశేఖర శర్మ

కాచిగూడ: బర్కత్‌పురలోని మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుప్రభాతం, నిర్మల్య విసర్జన, అష్టోత్తర పారాయణం, ఉత్సవరాయ పాదపూజ, విశేష ఫల పంచామృత అభిషేకం, తులసీ అర్చన, హస్తోదక తీర్థ ప్రసాదం, నైవేద్యం, మహా మంగళ హారతి, స్వస్తి వచనం, రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం మఠం ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ పూజల్లో మఠం మేనేజర్ సూర్యచంద్రశేఖర శర్మ కొడూరి, మఠం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో...

లింగంపల్లిలోని రాఘవేంద్ర స్వామి బృందావన సమితిలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సుప్రభాతం, అష్టోత్తరం, పంచామృత మధు అభిషేకం, అలంకరణ తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. బృందావన సమితి కార్యదర్శి బీసీ రాఘవేంద్రరావు, మఠం మేనేజర్ నరసింహాచార్ కండ్లూర్, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్ గరిగంటి రమేష్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన దాస వాణి కార్యక్రమం భక్తులందరినీ ఆకట్టుకుంది.

మేరుచక్ర ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవం



చిక్కడపల్లి: బాపు సేవక్ సమాజ్ శ్రీరాజరాజేశ్వరి దేవాలయంలో మంగళవారం మేరుచక్ర రాజము ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివదత్త కార్తికేయ దేవర మహాస్వామి శ్రీశారద శ్రీవిద్య పీఠం మల్లీశ్వరం ఉత్తర పీఠాధికారి అమృత భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఇక్కడి అమ్మవారు చింతామణిగా భక్తులను అనుగ్రస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆనంద్‌స్వామి, సాయిస్వామి పాల్గొన్నారు.

హత్యాచార దుండగులను కఠినంగా శిక్షించాలి

ముషీరాబాద్: పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎస్‌హెచ్‌ఆర్‌సీఐ వైస్‌చైర్మన్ బెటిన లంక డిమాండ్ చేశారు. ముషీరాబాద్ చౌరస్తాలో మంగళవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బెటిన లంక మాట్లాడుతూ.. మహిళలపై రోజురోజుకు దాడులు, హత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. వాటిని నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్లోబల్ అంబాసిడర్ డా. రవికుమార్, జయకుమార్, భాస్కర్, సతీష్, మునిరాం, ప్రసాద్, రూప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణి వేద ప్రచార్ వారోత్సవాలు

కాచిగూడ: స్వాతంత్య్ర సమరయోధుడు పండిట్ గంగారామ్ స్మారక్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణి వేద ప్రచార్ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. విజయవీర్ విద్యాలంకర్‌ను సత్కరించారు. వేదపండితుడు, వేదాలకు కవితారూపం ఇవ్వడంలో తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి డా. విజయవీర్ విద్యాలంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య స్వామి విజయదేవ్ నైష్ఠిక్ జీ, శ్రుతికాంత్, భారతి, ప్రదీప్ జాజు, ప్రేమ్‌చంద్ మునోత్, రామచంద్రరాజు, శివాజీ, కామేష్ ఆర్య, నరేంద్ర ఆర్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబారం

చిక్కడపల్లి: శారద కళానికేతన్, త్యాగరాయగానసభల సంయుక్తాధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో మంగళవారం శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శనను నిర్వహించారు. కృష్ణుడిగా సత్యనారాయణ, దుర్యోధనుడిగా సంజీవరావు, ఇతర పాత్రల్లో జంధ్యాల సుబ్బలక్ష్మి, రామ్మోహన్, లింగమయ్య, రాములు, నరసింహారావు నటించి నాటకాన్ని రక్తికట్టించారు. ఓలేటి పార్వతీశం కళాకారులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, రాజబాబు, లంకా లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్, అనిల్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐజాక్ రాజ్‌కు ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ అవార్డు

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌కు చెందిన బీఎస్పీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజ్ ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్–2024 అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఇంటర్నేషనల్ పీస్ కాప్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ప్రొ. కింగ్ బాయ్ ఆన్ ఈ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా ఐజాక్ రాజ్ మాట్లాడుతూ.. ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు ఇంటర్నేషనల్ పీస్ కాప్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శశికుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం ... ఉప్పుగూడ–ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (45) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కురిసింది.. భయపెట్టింది!

- గంట పాటు వర్షం పడితే జలమయమవుతున్న వీధులు
- భారీ వర్షాలు కురిస్తే మా పరిస్థితి ఏంటని జంకుతున్న లోతట్టువాసులు
- సిబ్బందిని అప్రమత్తం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



వరదనీటితో నిండిపోయిన పాత నల్లకుంట రామాలయం పరిసరాల్లోని ఓ వీధి



ముషీరాబాద్ వరద నీటిలో కొట్టుకొచ్చిన కార్లు



నల్లకుంట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వరద ఉధృతికి ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. మరో ఘటనలో ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందాడు. నల్లకుంట పాత రామాలయం పరిసర ప్రాంతాల్లో వరదనీరు ముంచెత్తడంతో ఇళ్లల్లోకి చేరింది. స్ట్రీట్ నం.15లో నాలుగున్నర దశాబ్దాల క్రితం నాగమయ్య కుంట నుంచి వచ్చే వరద నీరు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సమీపంలోని హుస్సేన్ సాగర్ నాలాలో కలిసేలా 10 ఫీట్ల వెడల్పు, 12 ఫీట్ల లోతుతో భారీ బాక్స్ నాలా నిర్మించారు. కాగా నిర్వహణ లోపంతో నాలాలో సుమారు ఏడు అడుగుల మేర వ్యర్థాలతో నిండిపోయింది. ఫిర్యాదులను చేసినా పట్టించుకోకపోవడంతో వరదనీరు తమ వీధులను ముంచెత్తుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వరదల సమయంలో తాత్కాలిక పరిష్కార మార్గాలు వెతుకుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే కాలేరు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లోంచి బయటకు రావద్దని కోరారు. ఫీవర్ ఆసుపత్రి పాత రామాలయం వీధిలో బాక్స్ నాలా పైకప్పు కుంగిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కార్పొరేటర్ అమృత, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ నాలా అధికారులతో కలిసి మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. వీధుల్లో నిలిచిన వరద నీటిని తొలగింపజేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వర్షాలకు ధ్వంసమైన రోడ్లు, కుంగిన నాలా పై కప్పులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై తెగిపడే ప్రమాదముందని విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత, నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మోహన్ నాయుడు, వీరయ్య, రితీష్ తదితరులు పాల్గొన్నారు.



పాత రామాలయం ప్రాంగణంలో చేరిన వరదనీరు

ఆకస్మిక వర్షాలను దృష్టిలో పెటుకుని అప్రమత్తంగా ఉండాలి: జెడ్‌సీ

అంబర్‌పేట: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం డీఎంసీ మారుతీదివాకర్‌తో కలిసి మూసీ పరివాహక ప్రాంతాల్లో సందర్శించారు. లోతట్టు ప్రాంతాల్లో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆకస్మికంగా కురిసే భారీ వర్షాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందుకే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో భారీ వర్షాలతో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అవి పునరావృతం కాకుండా చూడలన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఏఎంహెచ్‌వో హేమాలత తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ రవిచారి పర్యటన..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి బాగ్‌లింగంపల్లిలోని పలు లోతట్టు ప్రాంతాలన్నీ అతలాకుతలం అయ్యాయి. బాగ్‌లింగంపల్లిలోని ఎల్‌ఐజీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, చిక్కడపల్లి, నల్లకుంట తదితర ప్రాంతాల్లోని బస్తీలు నీటమునిగాయి. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి ఆయా బస్తీలను పర్యటించి పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి నీటిని తోడి వేసే యంత్రాలతో కాలనీలలో ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా రవిచారి మాట్లాడుతూ.. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం వల్లనే పలు లోతట్టు ప్రాంతాలన్ని నీట మునుగుతున్నాయని సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పార్సిగుట్టలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ రవికుమార్

అధికారులు అందుబాటులో ఉండాలి: వినయ్‌కుమార్

చిక్కడపల్లి: వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ కోరారు. మంగళవారం వేకువజామున కురిసిన వర్షానికి పలు ప్రాంతాలలో చెత్తాచెదారంతో పాటు వరదనీరు నిలిచిపోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సూచనలతో ఆయన అధికారులు సిబ్బందితో కలసి ఆయా ప్రాంతాలలో పర్యటించి మాట్లాడారు. అధికారులు ఎప్పటిప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జవాన్‌లు విజయ్, ఆనంద్, ఆంజనేయులు, ఎస్‌ఎఫ్‌ఏలు రాజ్‌కుమార్, సోమేష్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



మూసీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్, అధికారులు



గాంధీనగర్ డివిజన్‌లో చెత్తాచెదారం తొలగింపు పనులను పరిశీలిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్



పాత రామాలయం వీధిలో కుంగిన నాలా పైకప్పును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు



పాత రామాలయం వీధిలో నిలిచిన వరద నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

గో సంరక్షణకు ముందుకు రావాలి

గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



గోశాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న మహేష్ అగర్వాల్, ప్రేమ్‌చంద్ మునోద్

కాచిగూడ: గో సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. గో ప్రేమి మనో కామ్నా గోశాలలో పశువుల దాణా కోసం గోశాల నిర్వాహకురాలు అన్నపూర్ణకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గోవుల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. గోవులను రక్షించుకోవడం కోసం ప్రజలే ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. గో రక్షణ కోసం ప్రజా ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ప్రేమ్ చంద్ మునోద్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ అధ్యక్షురాలు నిర్మలా సంఘీ, దీపక్ సాద్, మహేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీకి శుభాకాంక్షలు

నల్లకుంట: ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జె. నర్సయ్యకు నల్లకుంటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోనే ప్రదీప్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఎల్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

నర్సింగ్‌రావు సేవలు చిరస్మరణీయం



దివంగత బీజేపీ నేత నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: దివంగత బీజేపీ నేత సింగితం నర్సింగ్‌రావు పార్టీకి అందించిన సేవాలు చిరస్మరణీయమని పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు అన్నారు. మంగళవారం గోల్నాకలో జరిగిన నర్సింగ్‌రావు వర్ధంతి కార్యక్రమానికి హాజరై నర్సింగ్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ.. నర్సింగరావు చనిపోయే వరకు బీజేపీ పటిష్టతకు చేసిన కృషి మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు శ్యామ్‌రాజు, నర్సింగ్ యాదవ్, మూల రవీందర్‌గౌడ్, రాంచందర్, సలీమ్, కృష్ణంరాజు, కె.రవీందర్, రమేశ్, శ్రీధర్‌గౌడ్, సింగితం రాజేశ్, గోపాల్, సాయి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి



పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముషీరాబాద్: పద్మశాలి కులస్తుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేస్తానని తెలంగాణ పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో వల్లకటి రాజ్‌కుమార్ విజయం సాధించడంతో మంగళవారం ఆయనకు పద్మశాలి కులస్తులు ముషీరాబాద్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆదుకుంటామన్నారు. పేద విద్యార్థులకు అండగా ఉండి ఉత్తమ విద్యను అభ్యసించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బింగి నవీన్, రంగయ్య, నర్సయ్య, ఉదయ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్‌రావు, పున్న సత్యనారాయణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టొద్దనే హక్కు కేటీఆర్‌కు లేదు

టీపీసీసీ రాష్ట్ర కార్మిక విభాగం కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న వీవీ రవీంద్రనాథ్

ముషీరాబాద్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం ముందు పెట్టొద్దని ప్రశ్నించే హక్కు మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్మిక విభాగం కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కుటుంబంలో పుట్టిన రాజీవ్‌గాంధీ దేశ ప్రధానిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని సచివాలయం ముందు పెడతామని ప్రకటిస్తే దానిని అడ్డుకుంటామని కేటీఆర్ అనడం సరికాదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డీహెచ్ ఉమేష్, సీవీ రఘునాథ్, జి.రాజ్‌కుమార్, సి.సత్యనారాయణ, జానకీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూఢ నమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాధన సమితి కన్వీనర్ టి.రమేష్, టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, మానవ వికాస వేదిక అధ్యక్షుడు పి.సాంబశివరావు మాట్లాడారు. ప్రజల్లో మూఢ నమ్మకాలపై విశ్వాసం ఉండటంతో అనేక అనర్థాలకు దారితీస్తోందన్నారు. లౌకిక ప్రజాస్వామిక దేశంలో మూఢ నమ్మకాల పేరిట హత్యలు జరగడం హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ కార్యదర్శి శంకర్, ప్రముఖ హేతువాది గౌరీశంకర్, జేవీవీ జాతీయ నాయకురాలు స్వరాజ్యలక్ష్మి, కుల నిర్మూళన సంఘం నాయకులు కృష్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలో నాయకులు



నివాళులర్పిస్తున్న అభిషేక్ కెనడీ, వీడీ కృష్ణ, కెనడీ రాజు



రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు మంగళవారం ముషీరాబాద్/అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ భారతదేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రాజకీయాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని మహాత్మాగాంధీ అన్న మాటలను రాజీవ్‌గాంధీ నిజం చేశారన్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం



నివాళులర్పిస్తున్న టీపీసీసీ సేవా దళ్ మాజీ చీఫ్ ఆర్గనైజర్ పొన్నాడ సుబ్రహ్మణ్యం



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు